కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# ఫోటో

జి. ఆర్. శాస్త్రి, (ఎం.ఎస్సీ. ప్రథమ)
ఏ. యు. కాలేజి ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వాల్తేరు.

"ఆకులో ఆకునై, పూవులో పూవునై...."

అంటూ పాడుతూ గులాబీ మొక్కలకు నీరు పోస్తున్న మాధవి, గేటు చప్పుడు కావడంతో అటు చూసి "హలో బావా! ఇదేనా రావడం" అంటూ మూర్తిని నవ్వుతూ పలకరించింది. "అవునూ యూనివర్సిటీకి సెలవులిచ్చి నాలుగు రోజులయింది కదా ఇంతవరకూ దొరగారు యెక్కడున్నట్టో" కనుబొమలు పైకెత్తి వాలుగా చూస్తూ అడిగింది.

"మా ఫ్రెండొకడికి విజయనగరంలో పెద్ద ఆక్సిడెంట్ అయితేనూ పరామర్శించి, ధైర్యం చెప్పి వస్తున్నా" యెంతో విచారంగా ముఖం పెట్టి చెప్పాడు.

"ఆక్సిడెంటా యేమయింది పాపం?"

"పాపం! పెళ్ళి!!"

"సంతోషించాలే తెలివికి" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

మూర్తి వైజాగ్‌లో ఎం.కాం. చదువుతున్నాడు. మూర్తివాళ్ళ ఊళ్ళోనే రెండిళ్ళ అవతల ఉంటున్న అతని మేనమామ కూతురు మాధవి, ఆ ఊళ్ళోనే బి. ఎస్సీ ఫస్టియర్ చదువుతోంది. ఎం.కాం.కాగానే అతనికి మాధవిని ఇచ్చి చేయాలని రెండు కుటుంబాలవారి సంకల్పం. కాని అతనికి ఇంకా పై చదువులు చదవాలని ఉంది.

మాధవి అంటే అతనికి చిన్ననాటినుంచీ ప్రేమ. అయితే ప్రేమ అనేది జ్వరంలాంటిదయితే పెళ్ళి దానికి మందు, పెళ్ళిమందు వేసిన వెంటనే ప్రేమజ్వరం తగ్గిపోతుంది అనియెవరో రచయిత రాసిన మాటలు అతనికి నూటికి నూరు పాళ్ళు నిజమనిపిస్తాయి. కనుక మాధవిని వీలైనంత యెక్కువకాలం ప్రేమిస్తూ ఉండాలని అతని కోరిక.

వచ్చిన కొంచెం సేపటికి స్నానంచేసి తల తుడుచుకొంటూ "మాధవీ! నా సూట్‌కేస్‌లో షర్టు, లుంగీ ఉన్నాయి—కొంచెం తెచ్చిస్తావా ప్లీజ్!" అడిగాడు మూర్తి.

తెస్తానని వెళ్ళి రాకపోవడంతో గదిలోకి తొంగిచూసిన మూర్తికి, తెరిచి ఉన్న పెట్టె ముందు నిలబడి పోస్టుకార్డు సైజులో వున్న అందమైన అమ్మాయి ఫోటోని తదేకంగా చూస్తున్న మాధవి కన్పడింది.

అలికిడి విని అతనికేసి తిరిగి "ఈ అమ్మాయి యెవరు? మీ క్లాస్‌మేటా?" అడిగింది. కళ్ళలో కాస్తంత అసహనం, గొంతులో సన్నని వణుకు.

మూర్తి మౌనంగా ఉన్నాడు చెప్పాలా వద్దా అని శంసయిస్తున్న వాడల్లే.

"మాకు చెప్పకూడదు కాబోలు. అంత రహస్యమయితే వద్దులే" పురుషుని ఆవేశపరచయినా నిజం చెప్పించాలనే తరతరాల స్త్రీ తపన.

"అబ్బే అంత రహస్యం యేం లేదు. కానీ...."

"మాకు చెప్పకూడదు అవునా?"

"ఆ విషయం యిప్పుడప్పుడే అందరికీ చెప్పడం యిష్టంలేదు" మూర్తి గొంతులో యే భావం లేకుండా అన్నాడు, పెద్దవి అవుతున్న ఆమె కళ్ళనీ, కొద్దిగా అదురుతున్న ముక్కుపుటాల్నీ చూస్తూ.






అన్నాదేగానీ చెప్పకపోతే తన నెలా అర్థం చేసుకొంటుందోనని అనుమానం పట్టుకొంది. అనుకున్నంతా అయింది.

"ఓహో తెలిసిందిలే" అంటున్న ఆమె గొంతులోని వ్యంగ్యం, కళ్ళలోని అసూయ చూసి, ఫోటో చూసింది గనుక యెప్పటికైనా చెప్పక తప్పదు. ఇప్పుడే చెపుతేనో అనుకొంటున్నాడు.

ఇంతలోనే జడ వెనక్కి విసురుకుంటూ వెళ్ళిపోయింది 'ది ఫ్రౌనింగ్ ఏంజిల్'లా.

ఈ మధ్యనే చూసిన శోభానాయుడు నృత్య ప్రదర్శనంలోని "ఖండిత నాయిక" అభినయం కళ్ళముందు మెదిలింది వెళిపోతున్న మాధవి చూసిన చూపులో, వేగంగా వెళుతున్న భంగిమలో.

అలా వెళ్ళిన తర్వాత సుమారు వారం రోజులదాకా మూర్తి ఎదుట పడలేదు మాధవి. సాయంత్రం షికారుకు వెడుతూ వాళ్ళింటికేసి చూసేవాడు. ఒకటి, రెండుసార్లు తనని చూసి, గేటు దగ్గర నిలబడినదల్లా వెంటనే లోపలికి వెళ్ళిపోయేది. తాను బయటకు వెళ్ళినపుడు మాత్రం వచ్చి కొంతసేపు ఉండి వెడుతోందని యింట్లోవాళ్ళ మాటల్నిబట్టి గ్రహించాడు. కానీ ఫోటో విషయం యేమీ చెప్పినట్లు కనపడలేదు. అందుకు కొంత సంతోషించాడు.

* * *

రెండురోజులు సరదాగా ఉందామని వచ్చిన రాజుతో డ్రాయింగ్‌రూములో మాట్లాడుతుండగా అడుగులో అడుగు వేసుకొంటూ హాలులోంచి లోపలికి వెళుతున్న మాధవిని పిల్చాడు మూర్తి, తల తిప్పుకొని వెళ్ళిపోతుందేమోనని భయపడుతూనే.

కొత్త వ్యక్తి ఉండడం చూసి, పిల్చాక వెళ్ళకపోతే బావుండదనేమో కాబోలు వచ్చింది. ఒకరి కొకరిని పరిచయం చేశాడు మూర్తి.

కాసేపు ఏవో మాటలు సాగాయి.

హఠాత్తుగా రాజు, "ఒరేయ్! మా వాళ్ళు ఒకళ్ళు స్త్రీ పాత్ర ఉన్న నాటకం ఒకటి వేయాలనుకొంటున్నారు. నీ తరపున నేను ప్రామిస్ చేశా. ఖరగ్‌పూర్ నాటక పోటీల్లో ప్రైజ్‌వచ్చిన సంగతి........" అంటూ ఏదో చెప్పుకు పోతున్నాడు.

ఇంతలో "బావా నువు నాటకాల్లో...." అంటూ యేదో జ్ఞాపకం వచ్చిన దానిలా కుర్చీలోంచి లేచి మరో గదిలోకి పరిగెత్తడం ప్రారంభించేసరికి తనూ వెంటపడ్డాడు.

గబగబా పెట్టె తీసి అందులో ఫోటోని, మూర్తిని మార్చి మార్చి చూస్తూ చివరికి "ఛీ యేం బాలేదు" అంటూ ఫోటో పట్టుకు పారిపోయింది, అమ్మాయి వేషంలో పోల్చుకోలేనంతగా కన్పిస్తున్న బావ ఫోటోని అత్తయ్యకు చూపించాలనుకొంటూ. □